క్లుప్తంగా

అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ రాష్ట్ర నాయకులు కె.సూర్యం అన్నారు. ఆదివారం స్థానిక కామ్రేడ్ యు.రాములు స్మారకస్థూపం వద్ద జరిగిన అమరవీరుల వర్ధంతి సభలో ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం, కార్మికవర్గ హక్కుల కోసం, సామ్యవాద స్థాపన లక్ష్యంగా ఎన్నో పోరాటాలు నిర్వహిస్తున్న క్రమంలో నేల కొరిగిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు జూపాక శ్రీనివాస్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ

ముత్తారం: మండలంలోని కేశనపల్లి మున్నూరుకాపు సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తోట భూమయ్య పటేల్, అధ్యక్షుడిగా తోట చిన్న భూమయ్యపటేల్, ఉపాధ్యక్షులుగా బొజ్జ వేణుగోపాల్‌పటేల్, తోట సమ్మయ్యపటేల్, ప్రధాన కార్యదర్శి సాతిని రాకేశ్‌పటేల్, కోశాధికారి తోట నారాయణపటేల్, సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల రమేశ్‌పటేల్, సహాయ కార్యదర్శులు జక్కుల శ్రీనివాస్‌పటేల్, గాజుల శ్రీనివాస్‌పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పాల రవీందర్‌పటేల్, బొజ్జ మల్లయ్యపటేల్, తాట రమేశ్‌పటేల్, ఐద నరేశ్‌పటేల్, బండారి మొగిళిపటేల్, సాతిని లింగయ్య పటేల్, తోట రవీందర్ పటేల్, కందుకూరి మల్లయ్య పటేల్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గిరి వీరేందర్ పటేల్, గాదం శ్రీనుపటేల్, పుల్లెల కిరణ్‌పటేల్, ఆకుల కిరణ్‌పటేల్, తోట సత్తయ్యపటేల్ పాల్గొన్నారు.

ఉచితంగా మెడిసిన్ అందజేత

రామగిరి: సెంటినరీకాలనీ మదర్సా, కౌసర్ మసీద్‌లలో ఆదివారం జమాత్ ఇ ఇస్లామీ హింద్ వైస్ ప్రెసిడెంట్ క్వాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ ఆధ్వర్యంలో పిల్లలకు, సిబ్బందికి ఉచితంగా మెడిసిన్ అందజేశారు. కార్యక్రమంలో మౌలానా అమీన్, షఫీక్ అహ్మద్, పీరాన్, అబ్దుల్ మన్నన్ పాల్గొన్నారు.

కార్మిక విభాగం జిల్లా కన్వీనర్‌గా తిరుపతి



నియామకపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

రామగుండం: కాంగ్రెస్ పార్టీ సంఘటిత, అసంఘటిత కార్మిక విభాగం పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా పెంచాల తిరుపతిని నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వేలాది మంది సంఘటిత, అసంఘటిత కార్మికులున్నారని వారికి చట్టపరంగా రావాల్సిన వేతనాలు, ఇతరత్రా అలవెన్సులు అందించేందుకు కార్మిక పక్షపాతి పెంచాల తిరుపతిని నియమిస్తున్నామన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ ప్రతినిధులు బొంతల రాజేశ్, కాల్వ లింగస్వామికి తిరుపతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కల్లుగీత కార్మికుడికి పరామర్శ



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామానికి చెందిన గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు మేర్గ నరేశ్‌గౌడ్ ఆదివారం కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద జారి పడ్డాడు. ఈ ఘటనలో అతడి ఎడమ కాలు విగిరి గాయాలపాలయ్యాడు. ఈ మేరకు జెడ్పీటీసీ ఆముల నారాయణ బాధితుడి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని కుటుంబాన్ని పరామర్శించారు.

అడుగడుగునా అప్రమత్తం

- 24గంటలు నిఘా
- ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు
- వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీస్ యంత్రాంగం



సుల్తానాబాద్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సుల్తానాబాద్: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రాగనే నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఎన్నికలకు అవసరమైన సన్నాహాలు చేస్తూనే మరోవైపు నియమ నిబంధనలు 24 గంటలు పక్కాగా అమలు చేస్తున్నారు. రహదారుల వెంబడి వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. రహదారుల వెంబడి చెక్‌పోస్టులు, జిల్లా సరిహద్దుల వెంబడి ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తున్నారు.

నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. 24గంటల పాటు అప్రమత్తంగా ఉంటున్నామని, గ్రామాల్లో మద్యం విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు పేర్కొన్నారు.

కోడ్ అమలుకు తనిఖీ టీమ్‌లు

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడంపై దృష్టి సారించిన అధికారులు నిఘా ముమ్మరం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు అమలు చేసేందుకు ఏడు తనిఖీ బృందాలను నియమించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులను బృందాల్లో సభ్యులుగా చేసి రంగంలోకి దింపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో 24గంటల పాటు తనిఖీలు చేపడుతున్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్..

ఎలక్షన్ కోడ్ అమలును ఫ్లయింగ్‌స్క్వాడ్ టీం పర్యవేక్షిస్తుంది. ప్రచారంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనపై అందే ఫిర్యాదులపై స్పందించి తనిఖీలు నిర్వహిస్తారు. సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను గంటన్నరలోగా పరిష్కరించే బాధ్యతను ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం తీసుకుంటుంది. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం, నేషనల్ గ్రీవెన్స్ సెల్‌కు రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరిస్తుంది.

స్టాటిస్టిక్ సర్వెలెన్స్..

స్టాటిస్టిక్ సర్వెలెన్స్ బృందంలో ఒక్కో టీంలో ముగ్గురు సభ్యులు ఉంటారు. 24 గంటలపాటు పని చేస్తారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాల ఖర్చుల సమాచారంపై రహస్యంగా వీడియోలు చిత్రీకరిస్తారు. సరిహద్దు, సమస్యాత్మక ప్రాంతాల్లో మకాం వేసి కోడ్ అమలును పర్యవేక్షిస్తారు. వాహనాలను తనిఖీ చేస్తారు. నాలుగు బృందాల్లో ఆరుగురు చొప్పున సభ్యులు ఉంటారు.

వీడియో సర్వెలెన్స్ బృందాలు(వీఎస్టీ)

వీడియో సర్వెలెన్స్ టీంలు సభలు, సమావేశాల్లో రాజకీయనాయకులు, అభ్యర్థుల ప్రసంగాలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలను చిత్రీకరిస్తారు. ఏఈఎం, ఒక సహాయకుడు, ఓ వీడియోగ్రాఫర్ ఉంటారు. ఈ టీమ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రోజువారీ వివరాలను అందిస్తుంటారు. నియోజవకర్గానికి ఓ బృందం ఉంటుంది.

మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) టీంలు

మండలస్థాయిలో ఎంపీడీవోలు, గ్రామాల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో కమిషనర్లు ఎన్నికల నియమావళిని పరిశీలిస్తారు. కోడ్ ఉల్లంఘనపై అధికారులకు నివేదిస్తారు.

అకౌంటింగ్ బృందాలు..

నియోజకవర్గానికో అకౌంటింగ్ బృందాన్ని ఎన్నికల సంఘం కేటాయించింది. రాజకీయ పార్టీలు చేసే ఖర్చులపై కసరత్తు చేస్తుంది. ఎస్టీవోకు చెందిన సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ఈ టీం తనిఖీలు చేస్తుంది.

మానవాళికి ముప్పు 'కోనోకార్పస్'

- పల్లె ప్రకృతి వనాల్లో ఎక్కువశాతం ఇవే చెట్లు
- మేడారం పార్క్‌లో విస్తరిస్తున్న వైనం
- శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం: వైద్య నిపుణులు
- తొలగించాలని ప్రజల డిమాండ్



మేడారం ప్రకృతివనంలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

ధర్మారం: పక్షివాలని ప్రాణాంతరమైన చెట్లు.. మనిషిని మింగే మానుగా పిలువబడుతున్న కోనోకార్పస్ చెట్లు ధర్మారం మండలంలో విస్తరిస్తున్నాయి. ఈ మొక్కలతో మానవాళి, జంతువులు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని నిపుణులు చెప్తున్నప్పటికీ.. అవేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ఆ మొక్కలను పెంచుతున్నారు. ఫలితంగా భవిష్యత్‌లో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

అందం చాటున ప్రమాదం..

కానోకార్పస్ మొక్కలు తొందరగా, ఏపుగా పెరగటమే కాకుండా అందంగా కనిపిస్తాయి. దీంతో ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలను నాటడానికి ప్రారంభంలో ఆసక్తి చూపించారు. అవెన్యూ ప్లాంటేషన్ పేరిట రహదారుల వెంట కూడా ఈ మొక్కలు నాటారు. అయితే ఈ మొక్కల మూలంగా పర్యావరణంతో పాటు ప్రాణాలకు ముప్పు ఉంటుందని నిపుణులు చెప్పండడంతో ధర్మారం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో పెరిగిన మొక్కలను గ్రామస్తులే ఒక్కొక్కటిగా తొలగించారు. కానీ మండలంలోని నందిమేడారం ప్రకృతివనంలో మొత్తం కోనోకార్పస్ మొక్కలు నాటారు. వాటి సంరక్షణ కోసం నిత్యం నీటిని అందిస్తూ కొమ్మలను కత్తిరిస్తూ అందంగా తీర్చిదిద్దారు. అయితే ఈ అందం వెనుక ప్రమాదం దాగి ఉన్న విషయాన్ని గమనించకుండా మొక్కల పెంపకంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మనుషులకు ప్రమాదకరంగా ఉన్న ఈ చెట్లను వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

శ్వాసకోశ వ్యాధులు వస్తాయి

కోనోకార్పస్ చెట్లమూలంగా శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. ఈ చెట్ల నుంచి ఏడాదికి రెండుసార్లు పూత వస్తుంది. ఈ పూత ద్వారా వచ్చే పుప్పొడి శ్వాస ద్వారా శరీరంలోకి వెళ్లి శ్వాసకోశ సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా అనారోగ్యకరమైన వాసన వెదజల్లుతూ దుష్ప్రభావం చూపుతుంది. వీటితో ఊపిరితిత్తుల వ్యాధి, ఎలర్జీ, ఆస్తమా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. **- గౌతం, వైద్యాధికారి**

ప్రాణాంతకమైన చెట్లను తొలగించాలి



కానోకార్పస్ చెట్లనుంచి వెలువడే పుప్పొడి ప్రమాదకరమైనదని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నందున వెంటనే ఈ చెట్లను తొలగించాలి. గ్రామ ప్రజలకు శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తకముందే తొలగిస్తే బాగుంటుంది.

- పవన్‌యాదవ్, మేడారం

అనేక గ్రామాల్లో తొలగించారు



కానోకార్పస్ నాటిన మొక్కలను అనే గ్రామాల్లో తొలగించారు. మేడారంలో తొలగించటంలో జాప్యం చేయటంతో గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురిఅయ్యే అవకాశాలున్నాయి. వెంటనే ఈ మొక్కలను తొలగించాలి.

- తమ్మనవేని రవికుమార్, మేడారం

అనుమతితో తొలగిస్తాం



ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు కానోకార్పస్ మొక్కల పల్లె ప్రకృతివనంలో నాటాం. తొందరగా పెరిగిపెద్దగా అవుతాయని నాటాం. మూడు సంవత్సరాలలో చెట్లు వృక్షాలుగా అందంగా మారాయి. ఈ చెట్ల మూలంగా ప్రజలకు ప్రాణహానీ ఉందని తెలిసింది. అధికారుల అనుమతి తీసకుని త్వరలోనే తొలగిస్తాం. **- సామంతుల జానకి, సర్పంచ్, మేడారం**

ఆటోవాలాల ఆగడాలు.. వాహనదారుల ఇక్కట్లు



రైల్వేస్టేషన్ ఏరియాలో రోడ్డుకు అడ్డుగా నిలిపి ఉన్న ఆటోలు

- ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా నిలుపుతున్న వైనం

రామగుండం: రైల్వేస్టేషన్ ఏరియాలో ఆటోవాలాల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఎక్స్‌ప్రెస్ రైలు రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకుందంటే చాలు.. రైల్వేకాలనీ నుంచి ప్రధాన రహదారికి చేరుకునే రహదారికి అడ్డుగా ఆటోలు నిలిపి ప్రయాణికులను పిలుస్తుంటారు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిపై యథేచ్ఛగా ఆటోలను నిలపడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఆటోలను సైడ్‌కి నిలపాలని కోరితే వారిపైనే ఎదురుదాడికి పాల్పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ ఎదుట ప్రయాణికులను ఎక్కించుకునేందుకు పోటీ పడుతూ పక్క నుంచి వచ్చే వాహనదారులను గుర్తించకుండానే ఆటోలను తిప్పుతుండడంతో పలుమార్లు బైక్ వాహనదారులు అదుపు తప్పిన ఘటనలు అనేకం ఉన్నాయి. దీనిపై స్థానిక పోలీసులు స్పందించి ఆటోవాలాలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'

మంథని: మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుకు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకుల అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ కొండ శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ అన్నారు. ఆదివారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కమాన్‌పూర్ ఎంపీపీ భర్త రాచకొండ రవి ఆరోపిస్తున్నట్లుగా ప్రసాద్ అనే వ్యక్తికి కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. నాయకులు నరసింహారావు, కొమ్మిడి స్వరూప్, గుమ్మడి రాజయ్య, అజీంఖాన్ తదితరులు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం



నిత్యావసరాలు అందిస్తున్న సేవాసమితి సభ్యులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌కు చెందిన గద్దల రమేశ్ అనే నిరుపేద రిక్షా కార్మికుడు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలిసిన శ్రీసీతారామ సేవా సమితి గ్రూప్ సభ్యులు రూ.3వేల నగదు నిత్యావసర సరుకులతోపాటు ఖర్చులకు రూ.2వేల నగదు ఇచ్చారు. గ్రూప్ సభ్యుడు కార్తీక్ రూ.వెయ్యి అందజేశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దాతలు ఈ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. గ్రూప్ సభ్యులు గోలివాడ చంద్రకళ, మందల రమాదేవి, బిల్లా శ్రీదేవి, మేడి సుభద్ర, మేడగోని స్వప్న, శేఖర్ పాల్గొన్నారు.



దారి ఇలా.. వెళ్లేదెలా?

జ్యోతినగర్: నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డుపై ఇలా ప్రమాదకరంగా గుంతలు ఉంటే ప్రజలు ఈ దారి గుండా వెళ్లేదెలా అని అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రామగుండం కార్పొరేషన్ కృష్ణానగర్ నుంచి జంగాలపల్లెకు వెళ్లే దారిలో కొంతభాగం ఇటీవల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. డ్రైనేజీ ఛాంబర్స్‌ను ఏర్పాటు చేసి రోడ్డు వేయడం మర్చిపోయారు. దీంతో పగలుతో పాటు రాత్రి సమయాల్లో రోడ్డు మధ్యలో ఉన్న ఛాంబర్స్ ప్రమాదకరంగా మారాయి. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రామగుండం లయన్స్ క్లబ్‌కు గోల్డెన్ కప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

కోల్‌సిటీ: రామగుండం లయన్స్ క్లబ్ గోల్డెన్ కప్ అవార్డు, ఉత్తమ క్లబ్ అధ్యక్షురాలు అవార్డులు వచ్చాయి. హైదరాబాద్‌లోని కొంపల్లిలో లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆదివారం 'గ్లోబల్ యాక్షన్ టీం' పేరుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మికి గోల్డెన్ కప్ అవార్డుతోపాటు ఉత్తమ అధ్యక్షురాలు అవార్డును లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబూరావు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రామగుండం లయన్స్ క్లబ్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి బంక రామస్వామి పాల్గొన్నారు.

మగువ క్లబ్‌కు మూడు అవార్డులు



అవార్డు అందుకుంటున్న క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని మగువ లయన్స్ క్లబ్ మూడు అవార్డులను కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లోని కొంపల్లిలో ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ 'గ్లోబల్ యాక్షన్ టీమ్' పేరుతో ప్రత్యేక సమావేశానికి మగువ లయన్స్ క్లబ్ ప్రతినిధురాళ్లకు ఆహ్వానం అందింది. ఈ వేడుకలో గోదావరిఖని మగువ క్లబ్‌కు బెస్ట్ లీడర్‌షిప్ అవార్డు, ఉత్తమ మహిళా క్లబ్ అవార్డు, ఉత్తమ సభ్యత్వం అవార్డును మగువ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, ప్రధాన కార్యదర్శురాలు జి.సునీత, కోశాధికారి ఎ.శశికళ ఈ మూడు అవార్డులను లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సునీల్ కుమార్, డిస్ట్రిక్ గవర్నర్లు హెచ్.రాజిరెడ్డి, దీపక్ బట్టర్ చార్జి చేతుల మీదుగా అందుకున్నారు. మగువ క్లబ్‌కు వరుసగా మూడు అవార్డులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

భగీరథ లీకేజీ.. తాగునీరు కలుషితం



లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

- పట్టించుకోని బల్దియా

రామగుండం: అంతర్గాం వెళ్లే ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంట్రెన్స్ వద్ద భగీరథ పైపులైన్ లీకేజీతో తాగునీరు పూర్తిగా కలుషితమవుతోంది. నీటి సరఫరా సమయంలో తాగునీరు వృథా అవుతుండగా, సరఫరా నిలిచిన సమయంలో గుంతలో నిలిచి ఉండే నీటిలో పందులు, పశువులు సేద తీరుతున్నాయి. దీంతో తాగునీరు కలుషితం అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కార్పొరేటర్‌కు, అధికారులకు తెలిపినా స్పందించడం లేదని 21వ డివిజన్ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లీకేజీని నియంత్రించాలని కోరుతున్నారు.

కుండీలు ధ్వంసమవుతున్నా.. పట్టించుకోరేమి?

- నిర్లక్ష్యంలో అధికారులు



ధ్వంసమైన కుండీలు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకునే ప్రధాన రైల్వే వంతెనపై సుందరీకరణలో భాగంగా బల్దియా ఏర్పాటు చేసిన మొక్కల కుండీలను రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. కాగా పలుమార్లు బల్దియా పారిశుధ్య సిబ్బంది కుండీలను ఏర్పాటు చేసి పూలమొక్కలను ఏర్పాటు చేసినప్పటికీ మొక్కలను, కుండీలను ధ్వంసం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో పూలకుండీల్లో పెట్టిన మొక్కలకు సకాలంలో నీరు పట్టకపోవడంతో ఎండిపోతున్నాయని స్థానికులు చెప్తున్నారు. దీనిపై బల్దియా సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించి కుండీలను ధ్వంసం చేసేవారిని వెంటనే గుర్తించి మొక్కలను సంరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.